# అధ్యాయము 14

# ఎఱ్ఱ సముద్రమును దాటి వెళ్లుట

ఐగుప్తు దేశము నుండి ఇశ్రాయేలీయులు విడిపింపబడు కథనములో 14 మరియు 15 అధ్యాయములు ఆఖరు ఘట్టాలను కలిగి ఉన్నాయి. 14వ అధ్యాయములో దేవుని యొక్క బలమైన రక్షణను ప్రజలు అనుభవించారు, అలాగే 15వ అధ్యాయములో మాత్రం వారు ఆ రక్షణను వేడుకగా జరుపుకుంటారు.

పీహహీరోతు అను స్థలమునకు వెళ్లి అక్కడ ఉన్న ఎఱ్ఱ సముద్రము దగ్గర (14:1, 2) ఉండమని దేవుడు ఇశ్రాయేలుకు చెప్పాడు. ఆ తరువాత ఏమి జరుగుతుందో దేవుడు వారితో చెప్పాడు: ఫరో యొక్క హృదయము మరలా కఠినపరచబడుతుంది, మరియు ఆయన ఇశ్రాయేలీయులను తరుముతాడు; కాని దేవుడు ముగింపులో మహిమపరచబడతాడు (14:3, 4).

దేవుడు చెప్పినట్లుగానే, ఇశ్రాయేలీయులు తప్పించుకొని వెళ్లారని ఫరో విన్నప్పుడు, వారిని విడిపించుటను బట్టి ఆయన తన మనస్సును మార్చుకొన్నాడు. ఆరువందల రథములను తీసికొని, అరణ్యములో వారిని అనుసరించాడు, బహుశ తిరిగి వచ్చుడని వారిని బలవంతము చేయుటకు కాబోలు. దేవుని ప్రజలు పీహహీరోతులో ఉన్నప్పుడు ఐగుప్తీయులు వారిని కలిసారు (14:5-9).

ఐగుప్తీయుల సైన్యమును ఇశ్రాయేలీయులు చూచినప్పుడు, వారు భయపడిపోయి చచ్చుటకే వారిని ఆ అరణ్యములోనికి నడిపించాడా అని మోషేను వారు నిందించారు. దేవుడు వారిని కాపాడతాడు అని వారికి నిశ్చయతనిచ్చుటకు మోషే ప్రయత్నించాడు (14:10-14). ఆ తరువాత ఏమి చేయాలో దేవుడు మోషేకు చెప్పాడు, తద్వారా దేవుడు "మహిమపరచబడతాడు" అని పలికాడు (14:15-18).

"దేవుని యొక్క దూత" మేఘ స్తంభముతో ఐగుప్తీయులను వెనుకకు పట్టి ఉంచగా (14:19, 20), మోషే తన హస్తమును చాచాడు. సముద్రము చీలిపోయినది, మరియు ఇశ్రాయేలీయులు ఆరిన నేలపై నడచారు (14:21, 22, 29). ఫరో యొక్క సైన్యము వారిని అనుసరించుటకు ప్రయత్నించినప్పుడు, దేవుడు దానిని అసాధ్యపరచాడు (14:23-25). మోషే చేసిన ఒకే సంజ్ఞతో వారిని వెంబడిస్తున్న రథములపై నీరు మరలా వచ్చి, ఆ సైన్యము అంతయు నాశనమైపోయినది (14:26-28).

తాము విమోచింపబడియుండుట ఇశ్రాయేలీయులు చూచి ఐగుప్తీయుల మృతదేహములను కనినప్పుడు, వారు "యెహోవాకు భయపడి" మరియు "యెహోవాయందును మరియు ఆయన సేవకుడైన మోషే యందును నమ్మిక

యుంచిరి" (14:30, 31).

## ఫరో మరియు తన సైన్యము ఇశ్రాయేలీయులను తరుముట (14:1-9)

**1మరియు యెహోవా మోషేతో ఈలాగు సెలవిచ్చెను 2- ఇశ్రాయేలీయులు తిరిగి
పీహహీరోతు ఎదుటను, అనగా మిగ్దోలుకు సముద్రమునకు మధ్యనున్న బయల్సెఫోను
నెదుటను, దిగవలెనని వారితో చెప్పుము; దాని యెదుటి సముద్రమునొద్ద వారు
దిగవలెను. 3ఫరో ఇశ్రాయేలీయులనుగూర్చి - వారు ఈ దేశములో చిక్కుబడియున్నారు;
అరణ్యము వారిని మూసి వేసెనని అనుకొనును. 4అయితే నేను ఫరో హృదయమును
కఠినపరచెదను; అతడు వారిని తరుమగా; నేను ఫరోవలనను అతని సమస్త
సేనవలనను మహిమ తెచ్చుకొందును; నేను యెహోవానని ఐగుప్తీయులందరు
తెలిసికొందురనెను. వారు ఆలాగు దిగిరి. 5ప్రజలు పారిపోయినట్టు ఐగుప్తు రాజునకు
తెలుపబడినప్పుడు ఫరో హృదయమును అతని సేవకుల హృదయమును ప్రజలకు
విరోధముగా త్రిప్పబడి - మనమెందుకీలాగు చేసితిమి? మన సేవలో నుండకుండ
ఇశ్రాయేలీయులను ఎందుకు పోనిచ్చితిమి అని చెప్పుకొనిరి. 6అంతట అతడు తన
రథమును సిద్ధపరచుకొని, తన జనమును తనతోకూడ తీసికొని పోయెను. 7మరియు
అతడు శ్రేష్టమైన ఆరువందల రథములను ఐగుప్తు రథములన్నిటిని వాటిలో
ప్రతిదానిమీద అధిపతులను తోడు కొనిపోయెను. 8యెహోవా ఐగుప్తురాజైన ఫరో
హృదయమును కఠినపరపగా అతడు ఇశ్రాయేలీయులను తరిమెను. అట్లు
ఇశ్రాయేలీయులు బలిమిచేత బయలువెళ్లుచుండిరి. 9ఐగుప్తీయులు, అనగా ఫరో
రథముల గుఱ్ఱములన్నియు అతని గుఱ్ఱపు రౌతులు అతని దండును వారిని తరిమి,
బయల్సెఫోను ఎదుటనున్న పీహహీరోతునకు సమీపమైన సముద్రము దగ్గర వారు
దిగియుండగా వారిని కలిసికొనిరి.**

**వచనములు 1, 2.** మునుపటి అధ్యాయములో, ఇశ్రాయేలీయులు ఏతాములో ఉన్నారు (13:20). అక్కడ నుండి, **తిరిగి పీహహీరోతు ఎదుటను . . .** ఎఱ్ఱ సముద్రమునకు మధ్యనున్న **బయల్సెఫోను** దగ్గరకు వెళ్లాలని దేవుడు వారికి చెప్పాడు. ఈ స్థలముల యొక్క సరైన ప్రదేశము ఇప్పటికి అనిశ్చితము. ("ఎఱ్ఱ సముద్రము" ను గూర్చిన అధిక సమాచారము కొరకు, చూడండి *అనుబంధం: నిర్గమకాండము యొక్క మార్గము.*)

**వచనము 3.** ఇశ్రాయేలీయులు తీసికొనుచున్న చుట్టుదారి **ఫరో**కు అంతుపట్టి ఉండదు; ఆ ప్రజలు నాశనమగుచున్నవారు, **అరణ్యము వారిని మూసివేసెను** అని అనిపించి ఉండవచ్చు. CEV అనువాదం, "వారు ఆ అరణ్యమును దాటుటకు భయపడ్డారు కాబట్టి వారు, ఆ దేశమును విడచుటకు వేరొక మార్గమును వెతుకుచూ, తిరుగులాడుచున్నారు" అని అనువదిస్తుంది. ఈ వ్యూహము కొంత వింతగా అనిపించినప్పటికీ, ఇది దేవుని ఉద్దేశములకు అనుగుణ్యంగా ఉంది: ఇశ్రాయేలు వారిని విడిపించి తన శక్తిని చూపునట్లు ఫరో యొక్క సైన్యమును పట్టుకొనుటకుగాను ఈ ప్రయాణము ఒక ఎరగా పనిచేసింది.

**వచనము 4.** దేవుడే తన ఆలోచనలను ఇక్కడ వెల్లడి చేస్తున్నాడు, ఆయన ఉద్దేశము ఏమనగా **ఫరో యొక్క హృదయమును కఠినపరచుట.** నిర్గమకాండము చూచినట్లయితే కొన్నిసార్లు ఫరో తన హృదయమును కఠినపరచుకొన్నాడు; కాని తెగుళ్లను గూర్చిన కథనముల ఆఖరుకు వస్తే, దేవుడే తన ఉద్దేశములను నెరవేర్చు నిమిత్తము ఫరో యొక్క హృదయమును కఠినపరచినట్లుగా అక్కడ ప్రయోగించబడిన భాష మనకు సూచిస్తుంది. ఆయన తెగుళ్లను పంపి తన ప్రజలను విడిపించగా, ఆయన సమస్తమునకు పైన దేవునిగా తనను తాను వెల్లడిపరచుకొన్నాడు. ఇశ్రాయేలీయులను తరుముతూ ఫరో వచ్చి ఓడింపబడినప్పుడు, దేవుడే **మహిమ తెచ్చుకొన్నాడు** మరియు ఆయన నిజముగా యెహోవాయే **అని** ఐగుప్తీయులు తెలుసుకున్నారు.

**వచనము 5.** ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశమును విడిచారని వినినప్పుడు, ఫరో **మరియు అతని సేవకులు మనమెందుకీలాగు చేసితిమి?** అని ప్రశ్నించుకున్నారు. అరణ్యములోనికి తమ దేవుని ఆరాధించుటకు ఇశ్రాయేలు ప్రజలు వెళ్లినట్లుగాక, ఆయన అనుకుంటున్నట్లుగానే వారు ఆ దేశమును విడచి పారిపోవుటకు ప్రయత్నిస్తున్నారు అని ఆయన సలహాదారులు చెప్పి ఉంటారు.[1] బహుశ, **ప్రజలను** వెళ్లనీయకుండా ఫరో మునుపు ప్రతి తెగులు సంభవించిన తరువాత చేసినట్లుగానే తన హృదయమును మార్చుకొని ఉంటాడు. ఏది ఏమైనప్పటికీ, ఒక విలువైన ఆస్తిని వారు కోల్పోయారు అని ఐగుప్తీయులు గుర్తించారు; వారి నిర్మాణ పథకముల కొరకు ఉచితమైన సేవ చేయడానికి వారికింకా ఇశ్రాయేలీయులు ఉండరు.

**వచనములు 6, 7.** ఫలితముగా, కోల్పోయిన తన ఆస్తిని తిరిగి తెచ్చుకొనుటకు ఫరో వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. **ఆయన రథముతో** పాటు **శ్రేష్ఠమైన ఆరువందల రథములను**, అలాగే **ఐగుప్తు రథములన్నిటిని కూడా తోడుగా తీసుకెళ్లాడు.** ప్రతి రథముమీద **అధిపతులు** కూడా ఉన్నారు. “అధిపతి” (שָׁלִישׁ, *shalish*) అనే పదము మూలములో రథమునకు ఉండే సిబ్బందిలో మూడవ వ్యక్తిని సూచిస్తుంది; ఈ గుంపులో తరచూ ఒక సారధి, ఆయుధములను మోసే ఒక వ్యక్తి, మరియు ఒక యోధుడు ఉంటారు. ప్రతి ఒక్క రథములో ముగ్గురు చొప్పున ఉన్నారు అని పాఠ్యము సూచిస్తుండవచ్చు. కాని, ఈ పదము తరువాతి కాలములో ఉన్నతమైన పదవిలో ఉన్న ఒక “అధికారి”ని సూచించింది, ఈ విధముగానే అనేకమైన అనువాదములు ఈ మాటను తీసుకొన్నాయి.[2] యుద్ధములలో వినియోగించే సాధనములలో రథమే అతి భయంకరమైన సాధనము గనుక (ఇది నేటి కాలపు యుద్ధ టాంకర్ తో సమానం), ఫరో యొక్క సైన్యము నిజముగానే జయింపజాలనిది.

**వచనము 8.** పరిస్థితి యొక్క సారాంశం ఈ సందర్భంలో చెప్పబడింది. ఫరో యొక్క “మనస్సు త్రిప్పబడటమే” కాకుండా (14:5), **యెహోవా** కూడా [తన] **హృదయమును కఠినపరచాడు.** కాబట్టి, ఇశ్రాయేలీయులు **బలిమిచేత బయలువెళ్లుచుండగా** ఫరో వారిని **తరిమాడు.** בְּיָד רָמָה (*b^e^yad ramah*) అను మాట, దీనిని “బలిమి” అని అనువదించారు, దీని మూల అర్థము “బలమైన చేతితో” అని. “ఇశ్రాయేలు ప్రజలు, వారిని భయపెడుతున్న ఆపదను బహుశ వారు నిర్లక్ష్యము

చేయుటవలన, వారికి వచ్చిన స్థైర్యాన్ని సూచిస్తుంది."[3]

**వచనము 9.** 7వ వచనము నుండి కథనము మరలా సాగుతుంది, **ఫరో** తన **గుఱ్ఱపు రౌతులు మరియు అతని దండువారు** ఇశ్రాయేలీయులను తరిమారు అని ఈ వచనము చెప్తుంది. ఈ తరుముబాటు విజయవంతమే; ఇశ్రాయేలీయులు ఎఱ్ఱ సముద్రము వద్ద కూడి ఉండగా ఐగుప్తీయుల సైన్యము వారిని కలిసింది.

## ఇశ్రాయేలీయుల యొక్క విస్మయము (14:10-14)

**10ఫరో సమీపించుచుండగా ఇశ్రాయేలీయులు కన్నులెత్తి ఐగుప్తీయులు తమవెనుక వచ్చుట చూచి మిక్కిలి భయపడి యెహోవాకు మొఱపెట్టిరి. 11అంతట వారు మోషేతో - ఐగుప్తులో సమాధులు లేవని యీ యరణ్యములో చచ్చుటకు మమ్మును రప్పించితివా? మమ్మును ఐగుప్తులోనుండి బయటికి రప్పించి మమ్మును ఇట్లు చేయనేల? 12మా జోలికి రావద్దు, ఐగుప్తీయులకు దాసులమగుదుమని ఐగుప్తులో మేము నీతో చెప్పిన మాట యిదే గదా; మేము ఈ అరణ్యమందు చచ్చుటకంటె ఐగుప్తీయులకు దాసుల మగుటయే మేలని చెప్పిరి. 13అందుకు మోషే - భయపడకుడి, యెహోవా మీకు నేడు కలుగజేయు రక్షణను మీరు ఊరక నిలుచుండి చూడుడి; మీరు నేడు చూచిన ఐగుప్తీయులను ఇకమీదట మరి ఎన్నడును చూడరు. 14యెహోవా మీ పక్షమున యుద్ధము చేయును, మీరు ఊరకయే యుండవలెనని ప్రజలతో చెప్పెను.**

**వచనము 10.** ఐగుప్తీయులు వచ్చినప్పుడు, ఇశ్రాయేలీయులు **మిక్కిలి భయపడిరి.** అట్టి గొప్ప సైన్యమును తన చేతిలో కలిగి ఉన్న ఆ రాజునుండి వారు ఎలా తప్పించుకొనగలరు? ఆ ప్రజల యొక్క మొదటి స్పందన ఏమనగా సహాయము నిమిత్తము యెహోవాకు మొఱపెట్టిరి.

**వచనములు 11, 12.** ఇశ్రాయేలీయుల యొక్క రెండవ స్పందన ఏమంటే మోషేకు ఫిర్యాదు చేయడం (16:3; 17:3 చూడండి). **చంపుటకు మోషే తమను అరణ్యమునకు** ఎందుకు తీసికొనివచ్చాడు అని వారు వ్యంగ్యముగా ప్రశ్నించారు. వారు ప్రశ్నిస్తూ, **ఐగుప్తులో సమాధులు లేవని . . . మమ్మును రప్పించితివా?** అని అడిగారు. సుస్పష్టంగా, ఐగుప్తు దేశములో చాలా ఎక్కువ సమాధులే ఉన్నాయి. వారి ప్రశ్నలో ఉన్న వ్యంగ్యంలో భాగమేమంటే ఆ రోజులలో వేరే ఏ ఇతర సంస్కృతుల కంటే కూడా ఐగుప్తు దేశము మరణమును, సమాధిని మరియు స్మృత్యర్థ సమాధులను ఎక్కువగా ఉద్ఘాటించేది. "ఒకవేళ మేము మరణించవలసి వస్తే, మేము ఐగుప్తులోనే మరణించేవారము" అని ఆ ప్రజలు అంటున్నారు. వారిని విడిపించు నిమిత్తము మోషే ఐగుప్తునకు మొదటిసారి వచ్చినప్పుడు [వారి] **జోలికి రావద్దు** అని మోషేతో వారు చెప్పిన మాటను కూడా తిరిగి జ్ఞాపకము చేస్తున్నారు. యుద్ధములో మరణించుటకంటే తమ జీవితాంతము బానిసలవలే శ్రమననుభవించుటకే ఆ ప్రజలు ఎక్కువ ఇష్టత చూపారు.

మోషే మరియు ఆహారోనులు చేసిన ఆ సూచక క్రియలను ఇశ్రాయేలీయులు ఎందుకు జ్ఞాపకము చేసుకోలేదు? ఐగుప్తీయుల మీదికి దేవుడు పంపిన ఆ పది

తెగుళ్లను వారు అప్పటికే మరచిపోయారా? దేవుడు ఫరోను మరియు తన సేవకులను అధములను చేసి వారు ఇశ్రాయేలు ప్రజలను వెళ్లనిచ్చునంతగా వారిని తగ్గించాడని వారు గుర్తించలేకపోయారా? తమ బానిసలు వారిని విడచి వెళ్లుచుండగా ఐగుప్తీయులు స్వతహాగా వారికి ఇచ్చిన ఆ బహుమతులు ఏమయ్యాయి? దేవుడు చేసిన ప్రతి విషయమును గూర్చి దేవుని ప్రజలు నిజముగా ఆలోచన చేసి ఉంటే, మునుపు ఆయన వారి యొక్క అవసరతలు తీర్చినట్లుగానే తమ ప్రస్తుత పరిస్థితిలో వారిని కాపాడునట్లుగా ఆయనను ఖచ్చితముగా వారు నమ్మేవారు. కాని, వారి విశ్వాసము చాలా స్వల్పమైనదిగా అనిపించింది.

**వచనము 13.** విరుద్ధంగా మోషే, విశ్వాసమును మరియు దాని ఫలితంగా వచ్చు ధైర్యమును గూర్చిన మాటలను పలికెను. దేవుడు వారిని రక్షిస్తాడని చెప్పి వారి భయమును పోగొట్టెను. వాస్తవంగా, ఆయన ఆ విధంగా పలికినప్పుడు, వారు **యెహోవా కలుగజేయు రక్షణను చూస్తారు** ఆయన వారి పాపముల నుండి రక్షణను గూర్చి మాట్లాడుటలేదు. బదులుగా, ఐగుప్తు నుండి మరియు ఇశ్రాయేలీయులు అక్కడ అనుభవించిన బానిసత్వం నుండి రక్షణ (విడుదల)ను గూర్చి మాట్లాడుతున్నాడు. **ఐగుప్తీయులకు భయపడడమే** తప్ప ఇశ్రాయేలీయులు మరిదేనికిని భయపడలేదు. **వారిని ఇకమీదట మరెన్నడును చూడరు** అను మాటకు అర్థం, ఐగుప్తీయులు వారిని ఇక మీదట బానిసలుగా చేయుటలో విజయవంతం కాలేరు.

ఈ రక్షణ యెహోవా ద్వారా సాధింపబడుతుంది. ప్రజల యొక్క పని ఊరకే **నిలుచుండి** మరియు దేవుడు చేయుచున్నది చూడడమే అని మోషే చెప్పాడు. "నిలుచుండి" అను మాటకు బదులగా కొన్ని వెర్షన్లలో "కదలక ఉండుడి" (KJV; NKJV), మరికొన్నిటిల్లో "నిలకడగా ఉండుడి" (NRSV; NIV) అని ఉంది.

**వచనము 14.** దేవుడు ఒకరికొరకు పోరాడినప్పుడు, ఆ వ్యక్తి చేయవలసిన పని **మౌనంగా ఉండుట** - మౌనంగా వీక్షించి మరియు ఆయన యుద్ధంలో గెలవడం చూడడం మాత్రమే. **యెహోవా మీ పక్షమున యుద్ధము చేయును** అనునది ఈ వాక్యభాగంలో మూల ఆలోచన మరియు పాత నిబంధన గ్రంథంలో ప్రధాన అంశము.[4] ఇశ్రాయేలీయులు "యుద్ధ సన్నద్ధులుగా" (13:18) వెళ్లినను, వారి కొరకు పోరాడినవాడు "యుద్ధ శూరుడైన" (15:3) యెహోవా. అధ్యాయములో తరువాత, ఐగుప్తీయులు తాము ఓడిపోవడం గమనించినప్పుడు, "యెహోవా వారి పక్షమున మనతో యుద్ధము చేయుచున్నాడని" వారు ఏడ్చిరి (14:25). ఇశ్రాయేలీయులు స్వాతంత్ర్యమును పొందుకున్నది - వారి ఉన్నత బలమును బట్టి, ఆయుధాలను బట్టి, లేదా సైనిక దళమును బట్టి కాదు - యెహోవా వారి పక్షమున యుద్ధము చేసాడు గనుక.

## మోషేకు దేవుని హెచ్చరికలు (14:15-20)

**[15]అంతలో యెహోవా మోషేతో - నీవేల నాకు మొఱ్ఱపెట్టుచున్నావు? - సాగిపోవుడి**

**అని ఇశ్రాయేలీయులతో చెప్పుము. [16]నీవు నీ కఱ్ఱను ఎత్తి ఆ సముద్రమువైపు నీ చెయ్యి చాపి దాని పాయలుగా చేయుము. అప్పుడు ఇశ్రాయేలీయులు సముద్రము మధ్యను ఆరిన నేలమీద నడిచిపోవుదురు. [17]ఇదిగో నేను నేనే ఐగుప్తీయుల హృదయములను కఠినపరచుదును. వారు వీరిని తరుముదురు; నేను ఫరోవలనను అతని సమస్త సేనవలనను అతని రథముల వలనను అతని గుఱ్ఱపు రౌతులవలనను నాకు మహిమ తెచ్చుకొందును. [18]నేను ఫరో వలనను అతని రథముల వలనను అతని గుఱ్ఱపు రౌతులవలనను మహిమ తెచ్చుకొనునప్పుడు నేను యెహోవానని ఐగుప్తీయులు తెలిసికొందురనెను. [19]అప్పుడు ఇశ్రాయేలీయుల యెదుట సమూహమునకు ముందుగా నడచిన దేవదూత వారి వెనుకకుపోయి వారిని వెంబడించెను; ఆ మేఘస్తంభము వారి యెదుటనుండి పోయి వారి వెనుక నిలిచెను. [20]అది ఐగుప్తీయుల సేనకు ఇశ్రాయేలీయుల సేనకు నడుమ ప్రవేశించెను; అది మేఘము గనుక వారికి చీకటి కలిగెను గాని, రాత్రి అది వీరికి వెలుగిచ్చెను గనుక ఆ రాత్రి అంతయు ఐగుప్తీయుల సేన ఇశ్రాయేలీయులను సమీపించలేదు.**

**వచనము 15.** ఈ వచనములో, నమోదు చేయబడని **మోషే** విన్నపమునకు **యెహోవా** స్పందిస్తున్నాడు. మోషే ప్రజలతో ప్రోత్సాహకరమైన మాటలు మాట్లాడిన తరువాత లేక మాట్లాడక మునుపు, ఆయన దేవునితో మాట్లాడి, స్పష్టంగా దేవుని సహాయమును కోరెను. దేవుని యొక్క మొట్టమొదటి స్పందన ఏంటంటే, **నీవేల నాకు మొర్రపెట్టుచున్నావు?** ఈ మాటలు "నిన్ను రక్షిస్తానని నీకు నామీద నమ్మకం లేదా? నీవు ఏడవవలసిన లేదా ఫిర్యాదు చేయవలసిన అవసరం లేదు అని చెప్పినట్లు ఉంది." అప్పుడు దేవుడు ఒక అద్భుతమైన ఆజ్ఞ ఇచ్చాడు: **సాగిపోవుడి.** ఇశ్రాయేలీయులు "రాయి మధ్య మరియు కఠిన స్థలంలో ఉన్నారు - తరుముతున్న ఐగుప్తీయుల మరియు అగమ్య సముద్రము మధ్య ఉన్నారు."[5] వారి వెనుక ఫరో సైన్యం ఉంది, వారి ఇరు ప్రక్కల ఎడారి ఉంది, మరియు వారి ముందు యెర్ర సముద్రం ఉంది. వారు ఏమి చెయ్యాలి? "సాగిపోవుడి" అని దేవుడు చెప్పాడు.

**వచనము 16.** తరువాత, ప్రజలు ఎలా ముందుకు సాగిపోవాలో దేవుడు చెప్పాడు. మోషే [తన] **కఱ్ఱను ఎత్తి ఆ సముద్రము వైపు** [తన] **చెయ్యి చాపాలి** అప్పుడు సముద్రం పాయలుగా చేయబడుతుంది. ఇశ్రాయేలీయులు **ఆరిన నేలమీద** నడచిపోతారు.

**వచనములు 17, 18.** దేవుడు మరల **ఐగుప్తీయుల హృదయములను కఠినపరుస్తాడు**, మరియు వెంబడించడానికి ప్రయత్నిస్తారు. వారు ఆ విధంగా చేసినప్పుడు, వారి ద్వారా దేవుడు **మహిమపరచబడతాడు.** సముద్రంలో దేవుడు ఐగుప్తీయులను **సైన్యమును** నాశనం చేస్తాడనే వాస్తవమునకు ఇది సూచన. "నాకు మహిమ తెచ్చుకొందును" అనునది כָּבֵד (*kabed*) నుండి అనువదించబడింది, అనగా "భారీ, బరువైన, లేదా మహిమపరచబడిన." కొన్నిసార్లు ఈ పదమును ఇతరుల గౌరవమును మరియు ప్రశంసలను కలిగి ఉన్న సంపన్న మరియు ప్రభావవంతమైన వ్యక్తులను గూర్చి చెప్పడానికి ఉపయోగిస్తారు. అదియు గాక, మహిమపొందుటకు అర్హుడైన దేవునికి గౌరవమును ఇచ్చుటను గూర్చి వివరించేడప్పుడు ఈ పదమును

తరచు ఉపయోగిస్తారు. ఈ వాక్యభాగంలో, NIV చెప్తుంది, “నేను మహిమను పొందుకుంటాను” (NRSV; NEB; NAB; NJB చూడండి). CEV చెప్తుంది, “నేను మహిమపరచబడతాను.” ఇశ్రాయేలీయులు మరియు **ఐగుప్తీయులు** ఇద్దరు కూడా నేనే **యెహోవానని తెలిసికొంటారు.**

**వచనము 19.** సముద్రము మధ్య నుండి వెళ్లుటకు మార్గమును సిద్ధపరచుచున్న సమయంలో ఇశ్రాయేలీయులను భద్రపరచేందుకు, ఐగుప్తీయులకు మరియు ఇశ్రాయేలీయులకు మధ్య దేవుడు కంచె వేసాడు: **ఇశ్రాయేలీయుల యెదుట సమూహమునకు ముందుగా నడచిన దేవదూత వారి వెనుకకుపోయి వారిని వెంబడించెను; ఆ మేఘస్తంభము వారి యెదుటనుండి పోయి వారి వెనుక నిలిచెను. మేఘము** కూడా వారి వెనుకనుండి పోయి వారి యెదుట నిలుచునట్లుగా కదలింది అని వాక్యభాగము స్పష్టం చేస్తుంది.

దేవదూత మరియు మేఘము దేవుని యొక్క ఉనికిని సూచిస్తుంది. మేఘ మరియు అగ్ని **స్తంభము** ఇశ్రాయేలీయుల సేనపై ఉండి వారి ప్రయాణంలో ఇశ్రాయేలీయులను నడిపించెను. ఈ విధంగా, దేవుడు తన స్థిరమైన ఉనికిని ఇశ్రాయేలీయులకు కనిపించు రీతిగా తెలియజేసాడు. ఈ వాక్యభాగంలో “దేవదూత” మేఘస్తంభములో ఉన్నట్లుగా, 13:21, 22లో, యెహోవా మేఘ స్తంభములోను మరియు అగ్ని స్తంభములోను ఉన్నట్లుగా చెప్పబడింది. ఒక విధంగా, “యెహోవా,” “దేవదూత,” మరియు “స్తంభము” ఇవన్నియు ఇశ్రాయేలీయుల మధ్య దేవున్ని మరియు ఆయన ఉనికిని సూచిస్తాయి.

**వచనము 20.** ఇరు సేనల మధ్య నిలిచున్న మేఘము కొంత **వెలుగును** ఇచ్చింది, కాని దాని ప్రథమ పని ఏంటంటే రాత్రి వేళలో మరియు సముద్రము ద్వారా గాలి వీస్తుండగా దేవుని ప్రజల నుండి ఐగుప్తీయులను దూరంగా ఉంచడమే.

## ఇశ్రాయేలీయులు విమోచించబడ్డారు (14:21-25)

**21మోషే సముద్రము వైపు తన చెయ్యి చాపగా యెహోవా ఆ రాత్రి అంతయు బలమైన తూర్పు గాలిచేత సముద్రమును తొలగించి దానిని ఆరిన నేలగా చేసెను.**
**22నీళ్లు విభజింపబడగా ఇశ్రాయేలీయులు సముద్రము మధ్యను ఆరిన నేల మీద నడచిపోయిరి. ఆ నీళ్లు వారి కుడి యెడమ ప్రక్క లను వారికి గోడవలె నుండెను.**
**23ఐగుప్తీయులును ఫరో గుఱ్ఱములును రథములును రౌతులును వారిని తరిమి సముద్ర మధ్యమున చేరిరి. 24అయితే వేకువ జామున యెహోవా ఆ అగ్ని మేఘమయమైన స్తంభమునుండి ఐగుప్తీయులదండు వైపు ఐగుప్తీయుల దండును కలవరపరచి 25వారి రథచక్రములు ఊడిపడునట్లు చేయగా వారు బహు కష్టపడి తోలుచుండిరి. అప్పుడు ఐగుప్తీయులు - ఇశ్రాయేలీయుల యెదుటనుండి పారిపోదము రండి; యెహోవా వారి పక్షమున మనతో యుద్ధము చేయుచున్నాడని చెప్పుకొనిరి.**

**వచనము 21. మోషే** దేవుని హెచ్చరికలను అనుసరించడం కొనసాగించాడు. ఆయన **తన చెయ్యి చాపగా**, మరియు **రాత్రి అంతయు బలమైన తూర్పు గాలిచేత**

దేవుడు **నీరును విభజించెను.** ఏమి నాటకీయ సంఘటన! ఇది అద్భుతం - ఏ ఇతర రీతిలో వర్ణించలేని దేవుని అద్భుతమైన చర్ అనుటలో సందేహమేమీ లేదు. దేవుడు అతీంద్రియమైన పనిని, అద్భుతమును చేయుటకు ఒక సాధారణమైన సహజ శక్తిని అనగా "తూర్పు గాలిని" ఉపయోగించాడు. ఎనిమిదవ తెగులులో, ఆయన ఐగుప్తుదేశమంతటిని మిడతలతో కప్పుటకు మరల రాత్రింబగళ్లు వీచు "తూర్పుగాలిని" ఉపయోగించెను (10:13, 14). యెర్ర సముద్రమును విభజించిన "బలమైన తూర్పుగాలి" కవిత రూపంగా "[దేవుని] నాశికారంధ్రాల యొక్క పేలుడు" అని చెప్పవచ్చు (15:8). జరిగిన దానిని గూర్చి గ్రహించినట్లైతే, **సముద్రము** ద్వారా ఇశ్రాయేలీయులకు కలిగిన విమోచనను గూర్చి చెప్తున్న పాత నిబంధన పుస్తకాలు ఐగుప్తీయులను నాశనం చేసిన విధమును కాక ఎక్కువగా దేవుడు నీరును విభజించిన విధానమును ఒత్తి చెప్తున్నాయి.[6]

**వచనము 22. నీరు విభజింపబడుటతో, ఆరిన నేలమీద** ఇశ్రాయేలీయులు నడువగలిగిరి. దేవుని ప్రజలకు ఇరువైపులా పేర్చబడిన నీరును **గోడతో** పోల్చారు. బహుశా, గాలి రాత్రంతయు వీసింది కాబట్టి (14:21), ఇశ్రాయేలీయులు సముద్రమును దాటుటకు అంత ఎక్కువ సమయం పట్టింది. ప్రొద్దుపొడిచినప్పుడు నీరు అధిక బలముతో తిరిగి పొర్లెను అని వాక్యభాగం స్పష్టంగా చెప్తుంది (14:27).

**వచనములు 23-25. వేకువ జామున** అనగా ఇంచుమించు ఉదయం 2:00 మరియు 6:00 మధ్య **ఐగుప్తీయులు** ఇశ్రాయేలీయులను తరిమి **సముద్రము** మధ్యమున చేరారు. స్పష్టంగా, మేఘ స్తంభము ద్వారా ఫరో సైన్యమును ఇశ్రాయేలీయులను చేరకుండ చేసిన యెహోవా, వారిని ముందుకు కొనసాగించెను. నిదానంగా నడచు ఇశ్రాయేలీయులను, వారి వస్తువులను, వారి కుటుంబాలను, మరియు వారి పశువుల మందలను అతని యొక్క గుఱ్ఱములతో పట్టుకోవచ్చునని బహుశా ఫరో అనుకొనియుండవచ్చు.

అయితే, ఇశ్రాయేలీయులను అనుసరించి వారి రథములను సముద్రములోకి నడిపినప్పుడు, వారు వెంటాడుతున్న ప్రజలను పట్టుకోవడం అంత సులభం కాదని ఐగుప్తీయులు గమనించారు. ఆయన మేఘస్తంభములో మరియు అగ్నిస్తంభములో ఉండుట ద్వారా యెహోవా **ఐగుప్తీయుల దండును కలవరపరచి, వారి రథచక్రములు ఊడిపడునట్లు చేయగా వారు బహు కష్టపడి తోలారు.** దేవుడు ఐగుప్తీయులను ఏ విధంగా కలవరపరచాడో ఖచ్చితంగా తెలియదు. కొన్ని వ్యాఖ్యానాలు ఈ విధంగా ఊహిస్తున్నాయి, ఐగుప్తీయుల యొక్క ఆ బరువైన యుద్ధ రథములు ఇశ్రాయేలీయులు నడచిన ఆరిన నేలపై చీలిపోగా, వాటి చక్రాలు నిదానంగా కదలి, ఇరుక్కుపోయి యుంటాయి లేదా పడిపోయి యుంటాయి. వచనాలు వివిధ రకాలుగా అనువదించవచ్చు:

> యెహోవా . . . ఐగుప్తీయుల సేనను భయపడు రీతిగా చేసాడు. వారి రథముల చక్రాలను ఆయన అడ్డుకొన్నాడు తద్వారా అవి కష్టముగా మారాయి (NRSV; REB; NAB; NJB చూడండి).

. . . యెహోవా . . . వారిని భయపెట్టాడు. వారి రథచక్రాలు ఇరుక్కుపోయాయి, మరియు అది కదలడానికి కష్టముగా ఉండెను (CEV).

యెహోవా . . . [సేనను] కలవరపరచాడు. వారి రథచక్రాలను తీసివేసాడు తద్వారా వారు కష్టముగా నడిపారు (NIV; NKJV చూడండి).

ఆ సమయంలో, ఫరో సైనికులు తాము ఇశ్రాయేలీయులను తరుమలేము అని గ్రహించిరి. వారి సమస్య హెబ్రీయుల దేవుడైన **యెహోవా** నుండి వెలువడిందని వారు చెప్పారు. వారు ముందుగా మరచిపోయిన దానిని బహుశా గుర్తు చేసుకొన్నారు: ఇశ్రాయేలీయులను విడిపించుటకు దేవుడు ఐగుప్తులో చేసిన ప్రతిదీ. జ్ఞాపకం చేసుకొని, వారు భయపడ్డారు, మరియు ఇశ్రాయేలీయులను పట్టుకోవాలనే వారి ఆలోచనలను మళ్లించి **ఇశ్రాయేలీయుల యెదుటనుండి పారిపోదము రండి** అని ఆలోచించారు.

ఐగుప్తీయుల సైన్యలో ఎగసిన కలవరమును ఆలోచించండి. సైనికులు సముద్రంలోకి వెళ్లారు, కాని ఇప్పుడు వారి రథములను కదలించడానికి కొంతమంది పోరాడుతున్నారు. మిగతావారేమో తమ రథముల చక్రాలు దెబ్బతిన్న తరువాత వారి గుర్రాలను అదుపులో పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. మరికొందరు "వెనుదిరగండి" అని కేకలు వేయుచు పశ్చిమ తీరానికి వెళ్లుటకు ప్రయత్నించుచుండగా ఇంకొంతమంది, ముందుకు సాగిపోవుటకు ప్రయత్నిస్తున్నారనడంలో, సందేహం లేదు. వారి తీవ్ర భయంలో, విపత్తు అలుముకొంది.

## ఫరో సైన్యం మునిగిపోవడం (14:26-31)

**26అంతలో యెహోవా మోషేతో - ఐగుప్తీయుల మీదికిని వారి రథములమీదికిని వారి రౌతులమీదికిని నీళ్లు తిరిగి వచ్చునట్లు సముద్రముమీద నీ చెయ్యి చాపుమనెను.**
**27మోషే సముద్రముమీద తన చెయ్యి చాపగా ప్రొద్దుపొడిచినప్పుడు సముద్రము అధిక బలముతో తిరిగి పొర్లెను గనుక ఐగుప్తీయులు అది చూచి వెనుకకు పారిపోయిరి. అప్పుడు యెహోవా సముద్రము మధ్యను ఐగుప్తీయులను నాశనము చేసెను. 28నీళ్లు**
**తిరిగి వచ్చి ఆ రథములను రౌతులను వారి వెనుక సముద్రములోనికి వచ్చిన ఫరోయొక్క సర్వసేనను కప్పివేసెను; వారిలో ఒక్కడైనను మిగిలియుండలేదు.**
**29అయితే ఇశ్రాయేలీయులు ఆరిన నేలను సముద్రము మధ్యనున్నప్పుడు ఆ నీళ్లు వారి కుడి యెడమ ప్రక్కలను గోడవలె నుండెను. 30ఆ దినమున యెహోవా ఐగుప్తీయుల**
**చేతిలో నుండి ఇశ్రాయేలీయులను రక్షించెను. ఇశ్రాయేలీయులు చచ్చిన ఐగుప్తీయులను సముద్ర తీరమున చూచిరి. 31యెహోవా ఐగుప్తీయులకు చేసిన గొప్ప కార్యమును**
**ఇశ్రాయేలీయులు చూచిరి కనుక ఆ ప్రజలు యెహోవాకు భయపడి యెహోవాయందును ఆయన సేవకుడైన మోషేయందును నమ్మికయుంచిరి.**

**వచనములు 26, 27.** మరలా, **యెహోవా మోషేతో** ఈ విధంగా మాట్లాడెను **నీళ్లు తిరిగి** తమ స్థానానికి **వచ్చి** మరియు **ఐగుప్తీయులను** ముంచులాగున **సముద్రముమీద**

**నీ చెయ్యి చాపుమనెను.** దేవుడు చెప్పిన విధంగా మోషే చేసెను, మరియు నీరు **తిరిగి వచ్చెను.** సముద్రము వారిని ముంచివేస్తుండగా కలవరపడిన మరియు భయపడిన, రౌతులు సముద్రములోనికే వెళ్తున్నారు. వచనము 27లో **నాశనముగా** అనువదించబడిన נָעַר (*na'ar*) అను క్రియను, "తుడిచివేయుట" (NIV) మరియు "ఎగరవేయుట" (NRSV) అని కూడా అనువదించవచ్చు.[7] ఒక వ్యాఖ్యానకర్త ఈ విధంగా వివరించాడు,

> "ఎగరవేయుట" . . . అను క్రియకు "ఒకడు విడిపించుకొనుట, విదిలించుకొనుట" అను అర్థం కూడా వస్తుంది. కాబట్టి ఈ కథనమును మనం అక్షరార్థముగా తలంచకూడాదుగాని, అలంకారముగా భావించాలి: "దేవుడు ఐగుప్తీయులను సముద్రములోనికి విదిలించెను." ఈ సముద్ర అద్భుతము ద్వారా దేవుడు ఐగుప్తీయులకు, "మీరు చాలా చేశారు! ఇక చాలు వెళ్లండి!" అని చెప్పి వారి అంటిపెట్టుకొను సన్నిధిని మరి ఎన్నటికి లేకుండా ఒకేసారి విదిలించినట్లు ఉంది.[8]

**వచనములు 28, 29.** దేవుడు "వారిని విసిరివేసిన" పర్యవసానంగా **సముద్రములోకి వెళ్లిన** ఐగుప్తీయులందరూ సముద్రములో మరణించిరి. ఇరు సైన్యములు అనగా మిడతల సైన్యము మరియు **ఫరో సైన్యము** ఎర్ర సముద్రంలో నాశనము అయ్యారు (10:19) కాబట్టి రెండిటిని మధ్య సమాంతర రేఖ గీయవచ్చును. ఐగుప్తు సేనా నాశనము చేయబడిన తరువాత, ఐగుప్తీయులంటే కలిగిన భయము ఆందోళన చివరకు ఇశ్రాయేలీయుల నుండి తొలగిపోయింది.[9]

వచనములు 28 మరియు 29 ఐగుప్తీయుల విధికి ఇశ్రాయేలీయుల యొక్క అనుభవమును విరుద్ధంగా ఉంది. ఐగుప్తీయులు సముద్రము మధ్య నాశనము చేయబడిరి; కానీ దేవుడు **నీటిని** రెండు వైపులా **గోడవలె** నుంచగా **ఆరిన నేల మీద ఇశ్రాయేలీయులను** ఎర్ర సముద్రము మధ్య నుండి నడిపించుట ద్వారా **వారిని రక్షించెను** (14:22 చూడండి). జ్యేష్ఠకుమారుల మరణము ఐగుప్తీయులకు మృత్యువు వలె నుంటుండగా పస్కా ఇశ్రాయేలీయుల జీవితమును రక్షించేదిగా ఉంది, కాబట్టి ఎర్ర సముద్రము ఐగుప్తీయులకు మరణమును తెచ్చింది కాని ఇశ్రాయేలీయులకు నూతన జీవమును ఇచ్చింది.

**వచనము 30.** ఈ అధ్యాయము సముద్రము మధ్య నుండి ఇశ్రాయేలీయులు ప్రయాణిస్తున్న ఫలితాలను సంగ్రహించే ఒక ప్రకటనతో ముగుస్తుంది. విభజింపబడిన నీరు మధ్య ఆయన తన ప్రజలను సురక్షితంగా నడిపించి, దేవుడు వారిని రక్షించెను. ఐగుప్తీయుల ఓటమి మరియు తమ రక్షణను గూర్చి ఇశ్రాయేలీయులు నిశ్చయిత కలిగి ఉన్నారు, ఎందుకంటే వారి కళ్లతో, వారు **చచ్చిన ఐగుప్తీయులను సముద్ర తీరమున చూచిరి.** ఇది ఒక ప్రత్యక్ష సాక్షి ఇచ్చిన కథనమునకు మంచి ఉదాహరణగా ఉంది. వారు తమ కనులతో చూచితిరి గనుక ఎర్ర సముద్రములో దేవుడు వారిని ఐగుప్తీయులనుండి విడిపించాడని వారెన్నడును సందేహించలేదు.

**వచనము 31.** దేవుని గొప్ప (శక్తివంతమైన) **కార్యము** చేత కలిగిన విమోచన భయమును మరియు విశ్వాసమును పుట్టించింది. **ప్రజలు యెహోవాకు భయపడిరి!**

అలాటి అద్భుతములు చేసి తన శత్రువులను పూర్తిగా నాశనము చేయు దేవుని యెదుట ఒకడు భయముతో, గౌరవముతో, మరియు విధేయతతో జీవించాలి. ఇశ్రాయేలీయులు కూడా దేవునియందు మరియు తన ప్రతినిధిగా నున్న మోషేయందు నమ్మికయుంచిరి: **వారు యెహోవాయందును ఆయన సేవకుడైన మోషేయందును నమ్మికయుంచిరి.**[10] ఈ సమయమునకు ముందు మరియు తరువాత కూడా ప్రజలు మోషేయందు నమ్మికయుంచిరి అనేది దేవునియందు వారి విశ్వాసముతో సంబంధం కలిగియుంది. మోషే మాటలయందు నమ్మకముంచడమంటే దేవునియందు నమ్మకముంచడమే; దేవుని నమ్మడమంటే - తన ప్రజలను నడిపించుటకు దేవుడు ఏర్పాటు చేసిన మోషేయందు నమ్మకముంచడం.

## అన్వయము

### మన విశ్వాసం పరీక్షించబడినప్పుడు (అధ్యా. 14)

యాకోబు 1:3 ఈ విధంగా చెప్తుంది, "మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించును." బహుశా, "పరీక్ష" అంటే హింస అని యాకోబు ఆలోచన. దీని యొక్క భావం ఏంటంటే ఒక క్రైస్తవుని విశ్వాసం పరీక్షించబడినప్పుడు అతడు నమ్మకంగా ఉంటాడు మరియు ఆత్మీయతలో ఎదుగుతాడు. అనుకొనని విధంగా, పరీక్షలో అందరు ఉత్తీర్ణులు కాలేరు.

మన విశ్వాసం ఎప్పుడైనా పరీక్షించబడిందా? దేవునిని విడిచిపెట్టాలను శోధన మనకు కలిగిందా? వ్యక్తిగత అనారోగ్యం వలన, రోదన వలన, ఆర్థిక కష్టాల వలన, కుటుంబలో కలహాల వలన, లేదా వ్యక్తిగత సమస్యల వలన జీవితం మంచిగా గడవని సమయంలో - మన విశ్వాసం పరీక్షించబడుతుంది. మన జీవితం సక్రమంగా జరుగుతున్న సమయంలో కూడా కొన్నిసార్లు ఇది వాస్తవం. ఉదాహరణకు, శ్రేయస్సు భౌతికవదులుగా ఉండుటకు దారి తీస్తుంది. అప్పుడు మనం ఏమి చేస్తాం? ఎర్ర సముద్ర తీరాన నిలచియున్నప్పుడు ఇశ్రాయేలీయులకు కలిగిన అనుభవము కొన్ని నియమాలను ఇస్తుంది.

*మన విశ్వాసం పరీక్షించబడినప్పుడు, మనకు కనబడుచున్న రీతిగా విషయాలు అంత చెడ్డవి కాదని మనం గమనించాలి.* ఇశ్రాయేలీయుల పట్ల అది వాస్తవం. వారు తప్పించుకొన్నారని వారనుకొన్నారు. వారి ఆనందమును ఊహించండి! అప్పుడు వారు సముద్ర అంచున చేరుకున్నారు, మరియు వారి ఆనందం నిరాశగా మారింది. వారి ముందు సముద్రం ఉంది, ఎడారి ఇరిపైపుల ఉంది, మరియు వారి వెనుక ఫరో సైన్యం ఉంది (14:9). వారికి వ్యతిరేఖ్గా ఉన్న బలగంమ అధికంగా కనబడింది. వారికి ఏ మార్గము కనిపించలేదు. అయితే, మనకు మిగతా కథ తెలుసు కాబట్టి, బయటకు పోవుటకు మార్గం ఉందని మనకు తెలుసు. చివరకు, దేవుడు వారిని విమోచించాడు.

ఇశ్రాయేలీయుల వలె, సమస్యలను ఎదుర్కొన్నప్పుడు మనం ప్రతికూల పరిస్థితులను చూస్తాము, చెత్తవాటిని ఆలోచిస్తాము, మరియు అనుకూలంగా

వీక్షించడంలో విఫలమౌతాము. పరిస్థితి కనిపించే అంత కష్టం కాదను విశ్వాసం మనకు ఉండాలి.

*మన విశ్వాసం పరీక్షించబడినప్పుడు, మన దేవుని వైపు చూడాలి.* ఇశ్రాయేలీయులు "యెహోవాకు మొర్రపెట్టిరి" (14:10). అంత ఖచ్చితంగా ఉన్నారు వారు - కానీ అప్పుడు వారు సణగడం మొదలు పెట్టారు. అలా చేయుట ద్వారా, వారిని గూర్చి తెలియజేసే రెండు ప్రతికూల వైఖరులను కనుపరచారు: మరచిపోవడం మరియు కృతజ్ఞతలేకపోవడం. దేవుడు వారికి చేసిన కార్యములను వారు మరచిపోయిరి, మరియు ఆయన ఆశీర్వాదముల పట్ల కృతజ్ఞతలేనివారిగా ఉన్నారు. అయితే, దేవుడు వారి మొర్ర ఆలకించి విమోచన కలుగజేస్తానని వారికి హామీ ఇచ్చాడు. దేవుడు వారిని విడిపిస్తాడని మోషే హామీ ఇచ్చాడు: "భయపడకుడి! యెహోవా మీకు నేడు కలుగజేయు రక్షణను మీరు ఊరక నిలుచుండి చూడుడి (14:13, 14).

మన విశ్వాసం పరీక్షించబడినప్పుడు, దేవునివైపు తిరగడం మనకు సహజం. క్లిష్ట పరిస్థితుల్లో మనకు కావలసిన సహాయం మరియు ఆదరణ ప్రార్థన ద్వారా, వాక్యము ద్వారా, మరియు మన తోటి క్రైస్తవుల ద్వారా దేవునియందు మనం పొందుకొనగలము. కొన్నిసార్లు ప్రజలు దేవునికి దగ్గరవడానికి బదులు దూరంగా పారిపోతారు, సంఘము నుండి కూడా పారిపోతారు. అది మనకెన్నడును జరగకుండును గాక!

*మన విశ్వాసం పరీక్షించబడినప్పుడు, మనం కొనసాగిపోవాలి.* వాగ్దానం భూమికై మనం ముందుకు కొనసాగాలి. కథను గగూర్చిన అత్యంత ప్రాముఖ్యమైన విషయం నిర్గమ. 14లో దేవుని హెచ్చరికల్లో కనిపిస్తుంది. "నిలుబడి చూడుడి" అని మోషే చెప్పిన తరువాత (14:13), "సాగిపోవుడి" అని దేవుడు చెప్పెను (14:15). వారి విశ్వాసం పరీక్షించబడింది! వారు అనుమానించినప్పటికీ, వారు నిజంగా సముద్రంలోకి "ముందుకు సాగిపోయారను" దానిని అభినందించవచ్చు. సముద్రము పాయలుకాగా, వారు ఆరిన నేలమీద నడచిపోయిరి. అలా చేయుటద్వారా, వారు రక్షించబడి, తక్షణ ప్రమాదంనుండి తప్పించబడిరి.

మన విషయం ఏంటి? మన విశ్వాసం పరిక్షించబడినప్పుడు, మనం ఏమి చేయాలో మనకు తెలుసు. అనుమానాల్లో, భాయాల్లో, మరియు సమస్యల్లో మనం దానిని చేస్తామా లేదా అన్నది ప్రశ్న.

తరుచుగా, పరీక్షా పరిస్థితుల్లో లేదా క్లిష్ట పరిస్థితుల్లో మన విశ్వాసం పరీక్షించబడినప్పుడు, ఇశ్రాయేలీయులకు చెప్పబడింది మనం కూడా చేయాలి: (1) దేవునిపై ఆధారపడడం: "రక్షణను మీరు ఊరక నిలుచుండి చూడిడి" (14:13). (2) "సాగిపోవుడి" (14:15). "వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడుచు క్రీస్తు యేసు నందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురి యొద్దకే పరుగెత్తుచున్నాను" అని పౌలు చెప్పెను (ఫిలిప్పీ. 3:13, 14). మనం ముందు సముద్రం ఉందా? దేవుడు సముద్రమును పాయలుగా చేయగలడు. మన ముందు గోడ ఉందా? ఆ గోడను పడగొట్టుటకు దేవుడు మనకు సహాయం చేయగలడు. మన మూయబడిన తలుపును

ఎదుర్కొన్నామా? దేవుడు తలుపును తీయగలడు. మనం సముద్రం మధ్య నుండి నడవాలి, గోడను పగులగొట్టాలి, లేదా ద్వారాము నుండి ప్రవేశించాలి. మన విశ్వాసం యొక్క పరీక్షకు పరిష్కారం ఏంటంటే దేవుడు మన నుండి ఆశించినదానిని చేయుటకు "విశ్వాసం ఉంచడం."

*ముగింపు.* మన వ్యక్తిగత జీవితాలకు మరియు సంఘం యొక్క ఏకీకృతమైన జీవితమునకు దేవుని యొద్ద సమాధానం ఉంది. మన ముందున్న మార్గం కష్టమైనప్పటికీ మనం ఆయన హెచ్చరికలను విని మరియు సాగిపోవాలి. ఎర్ర సముద్రమును పాయలు చేయగలిగిన దేవుడు మనం దీవించబడుటకు మరియు ఇతరులకు ఆశీర్వాదకరంగా ఉండు ద్వారామును తెరుస్తాడు.

## తుదకు స్వాతంత్ర్యం! (అధ్యా. 14)

"స్వాతంత్ర్యం" అను పదమును ప్రజలు ప్రియమైనదిగా ఎంచుతారు. స్వేచ్ఛగా మరియు స్వాతంత్ర్యంగా ఉండుటకు అనేక రాజ్యాలు పోరాడాయి. అందుచేత, ఐగుప్తు బానిసత్వంలో నుండి విమోచింపబడిన ఇశ్రాయేలీయుల కథను గూర్చి వినుటకు మనం సంతోషపడతాం. బానిసత్వంలో నున్న ప్రజల మొర్రను దేవుడు ఆలకించి మరియు వారిని విడిపించాడు! అలాటిదే మన జీవితంలో కూడా చేయగలడు (యోహా. 8:32, 36).

*వారు బానిసలుగా ఉన్నారు.* వారి చేదు బాధ వలన దేవుడు ఇశ్రాయేలీయుల మొరను విన్నాడు (నిర్గమ. 3:7). ఆయన తన ప్రతినిధి ద్వారా ఐగుప్తు రాజును "నా ప్రజలను పోనిమ్మని" ఆజ్ఞాపించెను. అప్పుడు, తన బాహుబలము చేత, ఆయన వారిని బానిసత్వంలో నుండి విడిపించెను. మనం - పాపమునకు బానిసలంగా ఉన్నాము (రోమా. 6:19-23). ఈ బానిసత్వం మరణం అనే వేతనంతో కూడిన చేదైనదిగా ఉంది. మనం పాపమను బానిసత్వంలో ఉండగా, మనం దేవుడు లేనివారంగా ఉండి, క్రీస్తునుండి వేరుచేయబడి, నిరీక్షణ లేనివారంగా ఉన్నాము (ఎఫెసీ. 2:12).

*వారు శక్తివంతంగా దేవునిచే విమోచించబడ్డారు.* ఇశ్రాయేలీయులకు శుభవార్త ఏంటంటే వారి బానిసత్యం నుండి వారిని బయటకు తీసుకొచ్చేలా మానవ చరిత్రలో దేవుడు వ్యవహరించాడు (3:8). బాష సన్నద్ధం అయినప్పటికీ, ప్రత్యేకంగా అది అర్థవంతమైనది: "వారిని విడిపించుటకు నేను దిగివచ్చానని" అని దేవుడు చెప్పాడు. వారికి రక్షణ కల్పించుటకు మానవుల వ్యవహారాల్లో వ్యక్తిగతంగా దేవుడు జోక్యం చేసుకున్నాడన్నది అద్భుతంగా లేదు? దేవుడు వారిని తెగుళ్లను పంపించుట ద్వారా విడిపించాడు. కొన్నిసార్లు ఫరో మీరు వెళ్లవచ్చని ఇశ్రాయేలీయులతో వాగ్దానం చేసినట్లుగా కూడా కనిపిస్తుంది. తెగులు ముగిసిన ప్రతిసారి, ఆయన తన హృదయమును కఠినపరచుకొని మరియు వారి స్వాతంత్ర్యంను తిరస్కరించాడు. చివరకు, దేవుడు ఐగుప్తీయుల జ్యేష్ఠ కుమారులను చంపాడు (11:4, 5; 12:29), కానీ ఇంటి ద్వారబంధముల మీద రక్తపు గుర్తు వేసిన విధేయులైన ఇశ్రాయేలీయుల ఇండ్లను దాటిపోయాడు (12:7, 13 చూడండి). ఫరో బానిసలను విడిపించాడు కానీ

తరువాత తన మనసును మార్చుకున్నాడు మరియు వారిని వెళ్లనియ్యలేదు (14:5-9). అప్పుడు, ఎర్ర సముద్రము మధ్య నుండి దేవుడు ఇశ్రాయేలీయులను విడిపించాడు. ఫరో సైన్యం వెంబడించడానికి ప్రయత్నించినప్పుడు, వారు నశించిపోయిరి (14:24-28). చివరకు, ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్యం నుండి విడిపించబడ్డారు. ఇశ్రాయేలీయులు తమ మంచితనం వలన లేదా శక్తివలన విమోచింపబడలేదు, గాని దేవుని శక్తి, దయ మరియు కృప ద్వారానే విమోచింపబడ్డారు. వారు రక్తమువలన విమోచింపబడ్డారు - ఎందుకంటే వారు రక్తమును అడ్డకొమ్మలకు మరియు ద్వారబంధముల మీద రాసారు.

ఈ దిన ప్రజలకు శుభవార్త ఏంటంటే దేవుడు మరల మానవులను విడిపించడానికి మానవ చరిత్రలో జోక్యం చేసుకొన్నాడు. ఆత్మీయ బానిసత్యం నుండి విమోచింపబడాలని యేసుక్రీస్తు దిగివచ్చి, పుట్టి, జీవించి, మరణించి మరియు పునరుద్ధానుడై మరియు పరలోకంలోకి ఆరోహణమైయ్యాడు. బాప్తిస్మము ద్వారా మన జీవితాలకు ఆయన రక్తమును రాసుకొనుటకు ఆయన మనకు అవకాశము కల్పించెను (రోమా. 6:3, 4). బాప్తిస్మము పొందుటకు మేఘ మరియు సముద్రము మధ్య నుండి ప్రయాణించుటను పౌలు ఇష్టపడ్డాడు (1 కొరింథీ. 10:1, 2). అందుచేత, బాప్తిస్మమును వారి అనుభవముతో పోల్చవచ్చు. వారు సముద్రపు తూర్పుతీరమున నిలబడి వారి విమోచనను గూర్చి ఆనందించారు, కాబట్టి బాప్తిస్మము నీరు మధ్య నుండి పోయినప్పుడు మనం ఆనందించవచ్చు.

*ముగింపు.* మనం స్వేచ్ఛగా ఉండుటకు ఏదోఒకటి చేయాలనుదానిని ఎవరు కూడా తిరస్కరించలేరు. ఇశ్రాయేలీయులు రక్తమును తమ ద్వార బంధములపై రాసినట్లు, మనం కూడా బాప్తిస్మము పొందుటకు సమ్మతించాలి. మనం యేసుయందు నమ్మకముంచాలి, ఆయనయందు మనకున్న విశ్వాసమును ఒప్పుకొనుటకు ఇష్టపడాలి, మరియు పాపమును ఒప్పుకోవాలి మరియు బాప్తిస్మమందు ఆయనలో పాతిపెట్టబడాలి. మనం సువార్తకు లోబడినప్పుడు, అపరాధము నుండి, బానిసత్యం నుండి, పాపము వలన వచ్చు శిక్ష నుండి తప్పించబడతాము (అపొ. 2:38; రోమా. 6:22; 8:1). మన విమోచనకు కారణము మన విధేయత కాదు గాని క్రీస్తు రక్తము మరియు దేవుని కృప.

## "నిలబడి . . . సాగిపోవుడి" (14:13, 15)

ఇశ్రాయేలీయులు క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొన్నప్పుడు, దేవుని మొదటి హెచ్చరిక ఏంటంటే "నిలిచుండి" మరియు "సాగిపోవుడి." కొన్నిసార్లు మనం దేవుని చిత్తం కొరకు ప్రార్ధన చేస్తు, వాక్యము చదువుతూ, ధ్యానిస్తూ మరియు ఆయన చిత్తము కొరకు ఎదురుచుస్తూ నిలబడియుండాల్సిందే. వేరే పరిస్థితుల్లో, విశ్వాసంలో మనం "సాగిపోవాలి" దేవుని చిత్తానుసరంగా కార్యమును చేపట్టాలి. రెండు చేయడానికి మనం సిద్ధపడి ఉండాలి.

**“మోషేలో బాప్తిస్మము పొందుట”**

**(14:21, 22; 1 కొరింథీ. 10:1, 2)**

ఎర్ర సముద్రము ద్వారా ఇశ్రాయేలీయుల విమోచన కథను బాప్తిస్మము చిత్రంగా ఉపయోగించడంలో మనం న్యాయబద్ధంగా ఉన్నాము ఎందుకంటే పౌలు రెండింటిని 1 కొరింథీ 10:1, 2లో సరిపోల్చాడు. ఎర్ర సముద్రం మధ్య నుండి పోవడం ఏ విధంగా ఉంటుంది మనం క్రైస్తవులంగా మారినప్పుడు మనం ఏమి చేసాము? (1) రెండు బాప్తిస్మములు ముంచుట అను స్వభావమును కలిగియున్నవి: ఇశ్రాయేలీయులు మేఘములో మరియు సముద్రములో మునిగిరి; మనం నీళ్లలో మునిగాం. (2) రెండు రక్షణను తెచ్చాయి: ఇశ్రాయేలీయులకు బానిసత్వం నుండి రక్షణ వచ్చింది, మరియు మనం నూతన జన్మను అనుభవించాం. (3) రెండు కూడా ఆనందించడానికి కారణమయ్యాయి. (4) రెండు దేవుని విమోచనను సాధ్యపరచాయి. (5) రెండింటికి విశ్వాసం అవసరం. ఇశ్రాయేలీయులు దేవునియందు విశ్వాసం ఉంచి నీటి మధ్యనుండి నడవాలి ఎందుకంటే రక్షించబడుటకు మన విశ్వాసం ద్వారా దేవుని ఆజ్ఞలను మనం గైకొన్నాం. (6) రెండు కూడా ఒకదానిలో నుండి విముక్తిని కలుగజేసి మరో దానిలోకి నడిపించాయి. ఇశ్రాయేలు దేవుని ప్రజలయ్యారు, దేవుని కార్యమునకు మరియు చిత్తమునకు బాధ్యులయ్యారు; కాబట్టి మనం కూడా.

---

సూచనలు

[1]ఈ సలహా Umberto Cassuto చేత ఇవ్వబడింది, *A Commentary on the Book of Exodus*, trans. Israel Abrahams (Jerusalem: Magnes Press, 1997), 161, మరియు Peter Enns, *Exodus*, The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan, 2000), 271. [2]J. Philip Hyatt, *Exodus*, The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1971), 152. [3]Waldemar Janzen, *Exodus*, Believers Church Bible Commentary (Scottdale, Pa.: Herald Press, 2000), 176. [4]See ద్వితీయో. 1:30; 3:22; 20:4; యెహో. 10:14; 10:42; 2 దిన. 20:29 చూడండి. వారికొరకు పోరాడడానికి లేదా వారికి జయము కలిగించడానికి దేవుని ప్రజలను ఆయనపై ఆధారపడిన విధానమును చూచుటకు ఉదాహరణగా, యెహో. 6:1-21; న్యాయాధి. 6:13-16; 1 సమూ. 17:45-47; 2 రాజు. 6:16, 17; 19: 32-37 చూడండి. [5]John I. Durham, *Exodus*, Word Biblical Commentary, vol. 3 (Waco, Tex.: Word Books, 1987), 198. [6]Nahum M. Sarna, *Exploring Exodus: The Origins of Biblical Israel* (New York: Schocken Books, 1996), 114-16. Sarna చెప్పాడు యెహో. 4:22-28; కీర్తనలు. 66:5, 6; 77:15-21; 78:13, 53; 106:9-11, 22; 114:3, 5; 136:13-15; యెష. 51:9, 10; 63:11-13. [7]NIV ఈ విధంగా చెప్తుంది “సముద్రము దాని స్థలమునకు వెళ్లిపోయింది. ఐగుప్తీయులు దానివైపు పారిపోతున్నారు, మరియు యెహోవా వారిని సముద్రములో ముంచివేసెను.” NRSV ఈ విధంగా అనువదిస్తుంది, “. . . వేకువ జామున సముద్రము సహజ స్థితికి వచ్చెను. ఐగుప్తీయులు దాని ముందు పారిపోతుండగా, యెహోవా ఐగుప్తీయులను సముద్రంలో ముంచెను.” [8]Janzen, 180. [9]Sarna, 113. [10]ఇతర వాక్యభాగాలలో మోషే దేవుని “దాసుడుగా” (సేవకునిగా) పిలువబడ్డాడు (సంఖ్యా. 12:7, 8; ద్వితీయో. 34:5; యెహో. 1:2, 7; మలాకి.

4:4). ఈ గౌరవమైన హోదా(పేరు) ఒక ప్రత్యేకమైన పని కొరకు దేవునిచేత ఎన్నుకొనబడి మరియు ఆయనకు విధేయత చూపువారికి మాత్రమే ఇవ్వబడింది: అబ్రాహాము, యోబు, కాలేబు, యెహోషువ, దావీదు, ఏలియా, యెషయ, మరియు మెస్సీయ.